
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 49 వ భాగం

## దుష్యంతుడి చరిత్ర – 1

సూర్యవంశం గురించి వివరించాక ఇప్పుడు శుక మహర్షి చంద్రవంశం గురించి పరీక్షిత్తుకి చెప్పడం మొదలుపెడుతున్నాడు. అందులో వచ్చేదే ఈ దుష్యంతుడి చరిత్ర. దుష్యంతుడు వేటకని వెళ్ళి శకుంతలని పెళ్ళి చేసుకోవడం, ఆ తర్వాత ఆవిడెవరో మర్చిపోయి పుట్టిన పిల్లాడితో తన రాజ్యానికి వస్తే ఆవిడెవరో తెలియదనడం అన్నీ ఇందులోవే. ఇంతకుముందో సారి మహాలక్ష్మీ ఆవిర్భావం లో చెప్పినట్టుగా పోతన పొంగి పొరలే భక్తి తోటే కాక ప్రేమ కధలు కూడా అద్భుతంగా, హుందాగా రాయగలడు అనిపిస్తుంది ఇందులో.

క. భారత! నీవు జనించిన
పూరుని వంశంబునందుఁ బుట్టినవారిం
జారు యశోలంకారుల
ధీరుల వినిపింతు నధిక తేజోధనులన్. [9-592]

వ. పూరునకు జనమేజయుండు, జనమేజయునకుఁ బ్రాచీన్వాంసుండు, నా ప్రాచీన్వాంసునకుఁ బ్రవిరోధనమన్యువు, నతనికిఁ జారువుఁ బుట్టి; రా చారువునకు సుద్యువు, సుద్యువునకు బహుగతుండును, బహుగతునకు శర్యాతియు, శర్యాతికి సంయాతియు, సంయాతికి రౌద్రాశ్వుండును, రౌద్రాశ్వునకు ఘృతాచి యను నచ్చరలేమ యందు ఋతేపువుఁ, గక్షేపువు, స్థలేపువుఁ, గృతేపువు, జలేపువు, సన్నతేపువు, సత్యేపువు, ధర్మేపువు, వ్రతేపువు, వనేపువు నను వారు జగదాత్మభూతుండైన ప్రాణునకు నింద్రియంబుల చందంబునఁ బదుగురు గొడుకులు జన్మించి; రందు ఋతేపువునకు నంతిసారుండును, నంతిసారునకు సుమతియు, ధ్రువుండు, నప్రతిరథుండునన ముువ్వురు పుట్టి; రందు నప్రతిరథునికిఁ గణ్వుండును, గణ్వునికి మేధాతిథియు, నతనికి బ్రస్కందుండు మొదలగు బ్రాహ్మణులును జన్మించి; రా సుమతికి రైభ్యుండు పుట్టె; రైభ్యునకు దుష్యంతుడు పుట్టె.
[9-593]

యయాతి కొడుకు పూరువు. ఆయన తండ్రికి తన యవ్వనం ఇచ్చి చివరిలో తండ్రి దగ్గిర్నుంచి రాజ్యం పుచ్చుకున్నవాడు. పూరువు పుట్టిన వంశంలోనే పాండవులూ పరీక్షిత్తూ, పుట్టినది కదా? అందులో వంశం విస్తరించి రైభ్యుడిదాకా వచ్చింది. అక్కడ రైభ్యుడికి పుట్టినవాడే దుష్యంతుడు. పై వచనం లో పేర్లు ఓ సారి చూడండి; పది మంది కొడుకులకీ రౌద్రాశ్వుడు ఎలా పెట్టాడో పేర్లు. వాళ్ళు ప్రాణులకి ఉండే ఇంద్రియాలలాగ పుట్టారుట. ఈ వచనంలో చెప్పిన జనమేజయుడు, పరీక్షిత్తు కొడుకు జనమేజయుడి వేరు. కొన్ని పేర్లు ఒక తరం నుంచి మరో తరానికి అలా వస్తూండడం మనకి ఎప్పట్నుంచో తెలిసినదే.

క. పారావారపరీతో
దార ధరాభారదక్ష దక్షిణహస్త
శ్రీ రాజిల్లఁగ నొకనాఁ
డా రాజేంద్రుండు వేఁటయం దభిరతుఁడై. [9-594]

ఈ దుష్యంతుడు ఓ రోజు వేటకి బయల్దేరాడు. ఈ రాజు ఎటువంటివాడో చెప్తున్నాడు ఈ పద్యంలో. నాలుగు చెరగులా సముద్రమే హద్దులా ఉండే తన రాజ్యాన్ని ప్రసశ్తమైన కుడిచేత్తో పాలించేవాడు.

క. గండక కంఠీరవ భే
రుండ శశవ్యాళ కోల రోహిష రురు వే
దండవ్యాఘ్ర మృగాదన
చండ శరభ శల్య భల్ల చమరాటవులన్. [9-595]

ఈ అడవి ఎటువంటి మృగాలతో నిండి ఉంది? గండక (ఖడ్గమృగము); కంఠీరవ (సింహము), భేరుండ (గండ భేరుండములు); శశ (కుందేలు); వ్యాళ (పాము); కోల (అడవి పందులు); రోహిష (కొండగొఱ్ఱె); రురు (లేళ్ళు); వేదండ (ఏనుగులు); వ్యాఘ్ర (పెద్దపులులు); మృగాదన (సివంగి); చండ (పులులు); శరభ (శరభము - సింహమును చంపునది); శల్య (ఏదుపందులు); భల్ల (భల్లూకము); చమర (చమరీ మృగము). అయితే ఇందులో వాడిన తెలుగు పదాలు కొన్ని గజేంద్ర మోక్షంలో, హిరణ్యకశిపుడి కధలో, నృసింహావతారంలో గమనించవచ్చు. శశ అంటే కుందేలు, శశి (తెల్లని) అంటే చంద్రుడు అనే అర్ధాలున్నాయి. విష్ణువు ని కీర్తించే "శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం" అనే శ్లోకంలో శశి వర్ణం ఇదే. ఈ పద్యంలో చెప్పిన మిగతా మనకి తెలియని జంతువులని మనసులో ఊహించుకోవల్సిందే. అడవులు కొట్టుకుంటూ పోతున్నాం కనక ఇందులో ఉండే జంతువులలో సగానికి సగం మనకి తెలియడానికి ఆస్కారం లేకపోతే తప్పు మనదే.

జంతువుల పేర్లు తప్ప మరో తెలుగు పదం వాడకుండా పోతన ఈ పద్యం కందం వృత్తంలో ఎలా సరిపెట్టాడో గమనించారా? నాకు తెలుగు వచ్చు అనేవాళ్ళు కూడా ఇందులో అన్ని పదాలకి అర్ధాలు చెప్పగలరా అంటే అనుమానమే.

క. చప్పుడు చేయుచు మృగముల
రొప్పుచు నీరముల యందు రోయుచు వలలం
ద్రిప్పుకొని పడఁగఁ బోవుచుఁ
దప్పక ద్రేయుచును వేఁటతమకం బొప్పన్. [9-596]

పెద్ద పెద్ద చప్పుళ్ళు చేస్తూ జంతువులని తరుముతూ వలలు పన్ని అన్నివిధాలుగా మొత్తానికి వేట తమకం తీరేలాగ అడవి అంతా తిరుగుతున్నాడు. ఎలా తిరుగుతున్నాడు?

క. మృగయూథంబుల వెంటను

మృగలాంఛన సన్నిభుండు మృగయాతురుఁడై
మృగయులు గొందఱు గొలువఁగ
మృగరాజపరాక్రమంబు మెఱయఁగ వచ్చెన్. [9-597]

మృగయూథంబుల వెంట అంటే జంతువుల సమూహాల కూడా వెళ్ళాడు, మృగలాంఛన సన్నిభుడు. మృగలాంఛన సన్నిభుడు అంటే లేడి అలంకారంగా ఉన్నవాడు – చంద్రుడు; అంటే చంద్రుడితో సమానమైన దుష్యంతుడు. చంద్రవంశం వాడు కదా, అందుకే ఆ ప్రయోగం. ఎలా వెళ్ళాడు? మృగయాతురుడై (వేటలో ఆసక్తితో), మృగయులు గొందరుగొలువగ – మరికొంతమంది వేటగాళ్ళు కూడా వస్తూండగా. అప్పుడాయన పరాక్రమం ఎలా ఉందంటే మృగరాజ (సింహం) పరాక్రమం లాగా ఉందిట. మృగం అనే ఒకే పదాన్ని నాలుగు పాదాల్లో అయిదు అర్థాలు వచ్చేలా ఎలా రాసాడో చూసారా?

వ. ఇట్లు వచ్చివచ్చి దైవయోగంబునఁ గణ్వమహాముని తపోవనంబు చేరం జని. [9-598]

అలా వేటాడుతూ కణ్వ మహాముని ఆశ్రమం చేరువలోకి వచ్చాడు. అంటే ఫలానా చోట ఒక చక్కని చుక్క ఉంది, ఆవిడ్ని ఎలాగోలా అనుభవించాలి, దాని కోసం ఈ వేట పెట్టుకుందాం అని – ఈ రోజుల్లో చలామణీ అయ్యే పెద్దమనుషుల్లా అన్నీ ఓ ప్రకారం ప్రణాలిక వేసుకుని – అడవికి రాలేదు. వేట కోసం వచ్చాడు. దైవ యోగం చేత ఇలా ఆశ్రమంలోకి రావడం కుదిరింది.

ఇంతవరకూ చదివితే మనకి కొన్ని విషయాలు తెలుస్తాయి. ఆ రోజుల్లో రాజులు వేట కోసం వెళ్ళినా ఇష్టం వచ్చినట్టూ కనపడిన అన్ని జంతువులనీ చంపేసి వాటి జాతుల్ని అంతరించే అంత వేట చేసేవారు కాదు. అడవుల్లో, ఆశ్రమాలలో ఎవరైనా మునులుంటే వాళ్లని ప్రశాంతంగా ఉండనిచ్చేవారు; ఎవరి పరిధుల్లో వారు హాయిగా ఉండేవారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే రాజు అనేవాడు రాజ్యం చేసినంతకాలం చేసి తర్వాత తప్పనిసరిగా వానప్రస్థం అనేదాన్ని స్వీకరించడానికి అడవులు అనే వాటిని తప్పనిసరిగా కాపాడుకునేవారు. ఎందుకంటే భగవంతుడనే వాడు ఒకడున్నాడనీ, ఆయన్ని చేరుకోవడం తమ కర్తవ్యం అనీ నమ్మడం వల్లా, జీవితంలో నాలుగు ధర్మాలూ పాటించాలనే ఉత్సుకత వల్లాను. ఉత్తరోత్తరా ఇవన్నీ మారి భగవంతుణ్ణి దర్శించడానికి అడవుల్లోకి వెళ్లక్కర్లేదనీ ఎక్కడున్నా ఆయన కనపడతాడనీ మొదలుపెట్టి చివరకి అసలు భగవంతుడనేవాడే లేడనే ఆలోచనలూ, మనుషుల్లో వైషమ్యాలూ, వాటిలోంచి అనేకానేక స్పర్థలూ పుట్టుకొచ్చాయి. దానితోటే జనభా పెరగడం, అడవులంటే లెక్కలేకపోవడం, వాటిని నాశనం చేసుకోవడం జరుగుతోంది. వింత ఏమిటంటే ఇవన్నీ మన కళ్ళ ఎదురుగా జరుగుతున్నా మనందరం నిమ్మకు నీరెత్తినట్టు ఏమీ చేయ(లే)క పోవడం.

సీ. ఉరుతర శ్రాంతాహి యుగళంబులకుఁ బింఛ;
ముల విసరెడి కేకిముఖ్యములను
గరుణతో మదయుక్త కలభంబులకు మేఁత;
లిడుచు ముద్దాడు మృగేంద్రములను
ఘనమృగాదనములు గాపుగా లేళ్ళతో;
రతులు సాగించు సారంగములను
నునుపుగా హోమధేనువుల కంఠంబులు;
దువ్వుచు నాడు శార్దూలములను [9-599]

తే. దార కలహించు నుందురు దంపతులకు
మైత్రి నంకించు మార్జాలమల్లములను
మతిని జాతివైరంబులు మాని యిట్లు
గలసి క్రీడించు మృగములఁ గాంచె నతఁడు. [9-599.1]

అలా ఆశ్రమం దగ్గర్లోకి వచ్చిన దుష్యంతుడికి సహజమైన శత్రుభావాలు విడిచిన జంతువులు కనిపించాయి. అవి ఎలాంటివి? అలసిన పాములకి పురులు విప్పి పింఛాలతో గాలి విసిరే నెమళ్ళు; మదించిన ఏనుగు గున్నలకి జాలితో ఆకులూ అలములు పెడుతున్న సింహాలు; జతకట్టే జింకలకి కాపలా ఉండే సివంగులు ; మృదువుగా హోమధేనువుల మెడలను రాస్తూ ఆడుకొనే పులులు; పోట్లాడుకుంటున్న ఉడుత జంటలకు పొత్తు కుదుర్చే పిల్లులు; ఇలా సకల జంతువులు కలసిమెలసి తిరగడం దుష్యంతుడు చూసాడు.

ఈ పద్యంలో చెప్పినట్టు అసలు మృగాలు అనేవి ఎక్కడైనా అలా కలిసి మెలిసి సంచరిస్తాయా అనే ప్రశ్న రావడం సహజం. దీనికి రెండు ఉదాహరణలు చెప్పుకోవచ్చు. మొదటిది బుద్ధుడి జీవితంలో జరిగిన అంగుళిమాళుడి గురించి. "ఫలానా చోట అడవిలో అంగుళిమాళుడు ఉన్నాడు అటు వెళ్లకండి స్వామీ" అంటే, "మరేం ఫర్వాలేదు" అని అటువేపు కావాలని వెళ్ళి ఆ అంగుళిమాళుణ్ణి కలుస్తాడు బుద్ధుడు. ఈ అంగుళిమాళుడనే వాడు పుట్టినప్పుడు మంచివాడే. కానీ ఓ గురువు దగ్గిర విద్య నేర్చుకుంటూంటే ఆ గురువుగారి భార్య వీణ్ణి మిగతా వారి కన్నా బాగా చూసేది. ఇది మిగతావాళ్ళకి కిట్టక గురువుకి చెప్పారు. ఆయనకి మాత్సర్యం పుట్టుకొచ్చి గురుదక్షిణ కింద వంద మందిని చంపి వాళ్ళ బొటనవేళ్లతో హారం చేసి ఇమ్మన్నాడుట. అలా ఈ మంచి కుర్రాడు ప్రజలని చంపుతూ తొంభై తొమ్మిది వేళ్ళు సంపాదించాడు. ఇంకొక్కటి కూడితే వందా పూర్తి అయ్యి దక్షిణ అయిపోతుందనుకుంటూండగా బుద్ధుడు అటువైపు రావడం జరిగింది. మరోసారి పైన చెప్పిన వచనం (9-598) చదివితే బుద్ధుడు అటువైపు అదే సమయంలో ఎందుకొచ్చాడో అర్ధం అవుతుంది మనకి.

అలా వచ్చిన బుద్ధుడు అంగుళిమాళుడితో 'ఆ దూరంగా ఉన్న చెట్టునుంచి ఒక ఆకు తెచ్చిపెడతావా?' అని అడిగేడుట. సరే అని ఆకు తెంపి తెచ్చిపెట్టాడు అంగుళిమాళుడు. "బాగుంది, మరోచిన్న సహాయం చేయి. ఈ ఆకు తీసుకెళ్ళి మళ్ళీ తెచ్చిన చోటే ఆ చెట్టుకు తగిలించేసి రా" అన్నాడుట బుద్ధుడు. అదెలా కుదురుతుందో అర్ధంకాక దిక్కులు చూస్తూంటే అప్పుడు చెప్పాడుట బుద్ధుడు, "చూసావు కదా, నువ్వు చేసే కర్మలన్నీ ఇటువంటివే. మనుషులని చంపడం, వారి బొటనవేళ్ళు తీయడం సులభమే, కానీ మళ్ళీ వాళ్ళని బతికించడం, ఆ వేళ్ళని అతికించడం సాధ్యం అవుతుందా? ఓ సారి పాపం మూటకట్టుకున్నాక అది వదలడం ఎంత కష్టమో అర్ధం అయిందా?" ఇది విన్నాక "మరి గురు దక్షిణ తీరేదెలా?" అని అడిగాడుట అంగుళిమాళుడు. ఇలా మనుషుల్ని చంపి బొటన వేళ్లని తీసుకురమ్మనేవాడు అసలు గురువేకాదనీ, అహింస అనేదే పరమోత్తమమైన ధర్మమనీ చెప్పాక ఆ రోజునుంచే సన్యసించి బుద్ధిడి శిష్యుడయ్యాడు అంగుళిమాళుడు.

అయితే ఎంతకాలం సన్యాసిలా ఉన్నా, గతంలో చేసిన పనులవల్ల తనలోంచి తప్పు చేసిన భావన పోవటం లేదని మొరపెట్టుకున్నప్పుడు ప్రతీసారి బుద్ధుడు చెప్పేవాడుట – గత కర్మలని మార్చడం సాధ్యం కాదు కానీ ముందు ముందు చెడు కర్మ చేయకుండా ఉండడం, పాత కర్మలనుంచి విముక్తి కోసం పాటుపడడం ఉత్తమం అని. చివరిలో అంగుళిమాళుడు సన్యాసిగా మారాడని విని అతన్ని అందరూ రాళ్ళతో కొట్టి బహిరంగంగా చంపినప్పుడు కూడా అంగుళిమాళుడు సహనంతోటే ఎవర్నీ ఏమీ అనకుండా ఊరుకుని బుద్ధుడ్ని తల్చుకుంటూ చచ్చిపోయాడని చెప్తారు.

రెండోది రమణుల ఆశ్రమంలో ఆయన పాములూ, కోతులూ, అరుణాచలం దగ్గిర అడవుల్లో చిరుతపులులూ, అనేకానేక జంతువులతో సహా అన్నీ సఖ్యంగా ఉండేవారు అని చెప్పడం మనం విన్నదే. బుద్ధుడు ఎక్కడ ఉన్నా చుట్టుపక్కల యాభై యోజనాల దూరంలో ఉన్న అందరూ ఈయన

శిష్యులైపోయేవారుట. అంటే వారి తపఃశ్శక్తి అటువంటిది. బుద్ధుడు, రమణుల వారి విషయంలో ఎందుకలా జరుగుతుంది మరి మనం ఉండే ఊరిలో మన ఇంట్లో ఎందుకలా జరగదు అనేదానికి చిన్న ఉదాహరణ చెప్పుకోవచ్చు. ఎక్కిరాల భరద్వాజ గారు చింతపల్లి అడవుల్లో ఉండే పాకలపాటి గురువు గారిగా పిలువబడే దామరాజు వెంకట్రావు గార్ని కలిసినప్పుడు అడిగారుట – "ఈ అడవిలో ఒక్కరూ ఉంటున్నారు కదా మీకు భయం వేయదా?" అని. దానికి వచ్చిన సమాధానం, "అసలు నాకు భయం ఎలా ఉంటుందో తెలియదు." ఈయన మరోసారి అడిగారు, "మరి మాకందరికీ భయం ఎందుకొస్తోంది?" దీనికి వచ్చిన దీటైన సమాధానం "వేరు అనిపించడం వల్ల." అంటే నేను వేరు, మీరు వేరు, ఆయన వేరు, ఈవిడ వేరు, పులి వేరు, సింహంవేరు, ఇలా విభజించుకుంటూ పోతే ఎవరికి వారే యమునా తీరే. కానీ సత్యం అనేది ఏమి చెప్తోంది? "ఆత్మవత్సర్వభూతాని."

ప్రపంచంలో అన్ని ప్రాణుల్లో ఉన్నది ఒకటే ఆత్మ. ఎవరూ మరొకర్నుంచి వేరుగా లేరు. మరి అది ఎలా తెలుస్తుంది? కళ్ళుమూసుకుని రమణులు చెప్పినట్టూ, "నేనెవరిని" అని తెలుసుకోవడం వల్ల. అది ఒకసారి తెలియగానే భయం అనేది మాయమౌతుంది. అప్పుడు "నేను" అనేది లేదు. అది తెలిసిన వాళ్ళే "భయం" పోయి ఇతరులకి "అభయం" ఇవ్వగలరు. దీన్నే రామకృష్ణులు అంటారు. ఆవు "హంబా, హంబా' అన్నంతకాలం అది అలాగే ఉంటూ ఉంది. ఎప్పుడైతే "నేను" అనడం పోగొట్టుకుని దాని చర్మం డోలుగా కట్టినప్పుడు "తూహూ, తూహూ" – నేను కాదు నువ్వే అంటుందో అప్పుడు కానీ దానికి విముక్తి లేదు. అందువల్ల ఈ "నేను" అనేది వదిలించుకుంటే అప్పుడు మన ఇంట్లో, మన ఊళ్ళో కూడా ఇటువంటివి జరగడం గమనించవచ్చు. దీనినే ముందు వ్యాసాల్లో అనేక సార్లు చెప్పుకున్నాం, "హరి మయము విశ్వమంతయు, హరి విశ్వమయిండు.." అని.

చదువుకోవడానికి ఇదంతా బాగానే ఉందండి, నాకంత తీరిక లేదు; ఓ గురువుగారొచ్చి మరి శ్రీరామకృష్ణులు వివేకానంద గారికి చేయి తలమీద పెట్టి తపఃశ్శక్తి అంతా ధారపోసినట్టుగా నాకూ, మీకూ, మనందరికీ ఆత్మ జ్ఞానం ఒక్క నిముషంలో ఎందుకు ఇవ్వరు ఈ పేరున్న స్వాములందరూ? మంచి ప్రశ్నే. ఇచ్చే ఆయన రామకృష్ణులైతే ఆయన దీటైన నరేంద్రుడు ఎక్కడున్నాడా, ఎప్పుడు నా దగ్గిరకి వస్తాడా అని కాసుకుని కూర్చుంటాడు కానీ అందరికీ తేరగా ఎందుకివ్వాలి తను అతి ప్రయాసతో సంపాదించిన తపఃశ్శక్తి? ఏళ్ళ తరబడి కఠోర శ్రమ చేసి సంపాదించిన తపఃశ్శక్తి ఆయన ఇస్తానన్నా తట్టుకునే శక్తి మనకి ఉందా? అసలే తీరిక లేని మనుషులం కదా, పోనీ ఎలాగో ఒకలాగ వాళ్ళు ఇచ్చినా మనం ఆ శక్తిని సరిగ్గా – ప్రపంచం కోసం నిస్వార్ధంగా – వాడగలమా? అన్నింటికీ మించి అసలు మనం దానికి అర్హులమా? వీటికి సమాధానాలు రావాలంటే చేయవల్సిన ఒకేఒక పని "నేనెవరిని?" అని ప్రశ్నించుకోవడం, కళ్ళు మూసుకుని శోధించి దానికి సమాధానం తెలుసుకోవడం. మొత్తం భాగవతం అంతా చెప్పేది ఇదే.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS